సాక్షి చిత్తూరు

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కాటేస్తున్న కరెంటు తీగలు

పుంగనూరు మండలంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులను కరెంటు బలి తీసుకుంది. - 8లో



12 టన్నుల కూరగాయల వితరణ

ఒంటిమిట్టలోని కోదండరామాలయానికి పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులు 12 టన్నుల కూరగాయలు అందించారు. - 8లో



'ఉపాధి'కెళ్లి ఆస్పత్రి పాలయ్యారు!

విజయపురం మండలంలో ట్రాక్టర్ బోల్తాపడి 21 మంది ఉపాధి కూలీలు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

63 మందికి గ్రేడ్-5 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 63 మంది గ్రేడ్-6 కేడర్ నుంచి గ్రేడ్-5 కేడర్ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రాంతాలకు ఉద్యోగోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆప్షన్‌లు పెట్టుకున్నారు. ఖాళీగా ఉన్న పంచాయతీలకు వారిని సర్దుబాటు చేయనున్నారు. తుది జాబితాను కలెక్టర్ ఆమోదానికి పంపారు. కార్యక్రమంలో జెడ్పీ, డీపీఓ కార్యాలయ సిబ్బంది పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెంచాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

కార్వేటినగరం : అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. గురువారం రాత్రి కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఎన్‌డీపీఎల్, పీడీఎస్ బియ్యం, తదితర అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. మహిళా పోలీసులు ద్వారా విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, మైనర్ బాలికలపై జరిగే అఘాయిత్యాల, అనర్థాలపై అవగాహన కల్పించి విద్యార్థినుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అమ్మాయిలను మోసగించడం, వేధించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సేష్టన్ పరిధిలో నమోదయ్యే హత్య కేసులకు గల కారణాలపై అధ్యయనం చేసి నియంత్రణకు కృషి చేయాలని, కీలక హత్య కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను సందర్శించి నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భూ తగాదాలు, పాత గొడవలు, నాటు సారా అమ్ముతున్న వారిని, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా డెప్యుటేషన్‌లు వేస్తూ కొంత మంది వైద్యులు, సిబ్బందిని మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. డబ్బులు ముట్టజెప్పినవారికి , తమకు నచ్చినవారికి అనధికారికంగా డెప్యుటేషన్‌లు వేస్తూ కార్యాలయంలో ఖాళీగా కూర్చోబెడుతున్నారు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉండాలనే నిబంధనలు గాలికొదిలేశారు. పల్లెల్లో రోజువారీ ఓపీ క్రమేణ తగ్గిపోతోంది. ఫలితంగా పల్లె వైద్యం పడకేసింది.దీంతో పల్లె ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు బాట పడుతున్నారు. వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

ఇష్టారాజ్యంగా డెప్యుటేషన్లు!

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనలు బేఖాతరు
- అమాయకులను ఏరికోరి తెచ్చుకుంటున్న వైనం
- కొనసాగుతున్న అనధికార డెప్యుటేషన్లు
- ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కిన అధికారులు
- పీహెచ్‌సీల్లో పడకేసిన వైద్య సేవలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఇష్టమొచ్చినట్లు డెప్యుటేషన్లు వేస్తున్నారు. రాష్ట్ర అధికారులు డెప్యుటేషన్లు రద్దు చేసినా.. ఇక్కడ మాత్రం కొనసాగిస్తున్నారు. అనుమానం వచ్చిన వారిని సీటు నుంచి లేపేస్తున్నారు. లేకుంటే డెప్యుటేషన్ రద్దు చేస్తున్నారు. వారి స్థానంలో అమాయకులను ఏరికోరి తెచ్చుకుంటున్నారు. అనధికారికంగా డెప్యుటేషన్లు ఇప్పిస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో మొత్తం 50 పీహెచ్‌సీలున్నాయి. అర్బన్‌హెల్త్ సెంటర్లు 15 దాకా ఉన్నాయి. ప్రధానంగా పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు చొప్పున పనిచేయాల్సి ఉంది. ఇందులో ఒకరు 'ఫ్యామిలీ డాక్టర్' చూసుకుంటే మరొకరు ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఈ విధానం పకడ్బందీగా నడిచింది. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్ల విధానాన్ని విధిగా పాటించింది. ఖాళీలుంటే వాటిని తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత వేధిస్తోంది.

డెప్యుటేషన్లపై కొందరిని కార్యాలయానికి పిలిపించాం



డెప్యుటేషన్లు రద్దు చేయాలన్నదే వాస్తవమే. డెప్యుటేషన్లు ఏదైనా చేసుకోవాలంటే రాష్ట్ర అధికారుల అనుమతి ఉండాల్సిందే. కానీ పనులు ఎలా జరుగుతాయి. అందుకే కొంత మంది సిబ్బంది, అధికారులను డెప్యుటేషన్‌పై తెచ్చుకున్నాం. అందుకే కార్యాలయంలో చకచకా పనులు సాగుతున్నాయి. కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న వారినే తెచ్చి సీట్లో కూర్చోబెట్టాం. డాక్టర్లు పది మంది లేరండి...నలుగురు మాత్రమే డెప్యుటేషన్‌పై ఉన్నారు.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

జిల్లా సమాచారం

పీహెచ్‌సీల సంఖ్య:	50
అర్బన్‌హెల్త్ సెంటర్లు:	15
పీహెచ్‌సీల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్న డాక్టర్ల సంఖ్య:	100
డాక్టర్లు లేని పీహెచ్‌సీలు:	03
ప్రస్తుతం ఒక్కో డాక్టరు ఉన్న పీహెచ్‌సీలు:	15
ఏడాదికి కిందట ఓపీల సంఖ్య (రోజువారీ):	8000 పైగా
ప్రస్తుత ఓపీ:	6000 లోపు
కార్యాలయంలో డెప్యుటేషన్లపై పనిచేస్తున్న వారు:	20 మందికి పైగా

పీహెచ్‌సీల్లో ఖాళీలు ఇలా...

గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలకు ఇద్దరు డాక్టర్ల చొప్పున వంద మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలుచోట్ల డాక్టర్లు ఖాళీ అయ్యారు. ప్రస్తుతం రాయల్‌పేట, ఎస్ఆర్‌పేట, పచికాపలం పీహెచ్‌సీల్లో ఇద్దరు డాక్టర్లు లేరు. అలాగే 15 చోట్ల ఒక్కొక్కరే వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 10 మంది పీజీ శిక్షణ కోసం ఫిబ్రవరిలో రిలీవ్ అయ్యారు. మరో 5 మంది డాక్టర్లు డెప్యుటేషన్లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్నట్లు సమాచారం. ఈ కారణంగా పల్లె వైద్యం పూర్తిగా గాడి తప్పింది. ఓపీల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గతంలో రోజువారీ ఓపీలు 8 వేలు దాటుతుంటే.. ప్రస్తుతం 6 వేలు దాటని పరిస్థితి ఏర్పడింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తిగా విస్మరించారు. డాక్టర్లు ఉన్నా... పల్లె వైద్యంపై పూర్తిగా ముఖం చాటేశారు. ఈ కారణంగా పల్లె జనం వైద్యం కోసం పట్నం వైపు పరుగులు పెడుతున్నారు. ఇక కార్యాలయంలో డెప్యుటేషన్లపై పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై అనుమానం వస్తే వెంటనే సీటు మార్చడం లేదా డెప్యుటేషన్లు రద్దు చేయడం చేస్తున్నారు. లేకుంటే మానసికంగా వేధిస్తున్నారని పలువురు వైద్యులు కంటతడి పెడుతున్నారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వేదికగా..

అనధికార డెప్యుటేషన్లకు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు డెప్యుటేషన్లను అమలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. డెప్యుటేషన్ల వేయించుకున్న వారంతా కార్యాలయంలోనే తిష్ట వేసి కాలక్షేపం చేస్తున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఓ అధికారి ఇదే అదునుగా భావించి కాసులు కొల్లగొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనధికార డెప్యుటేషన్ల కోసం రూ.లక్షల్లో గుంజుతున్నట్లు వైద్యుల వర్గం కోడైకూస్తోంది. ఇలా 20 (డాక్టర్లు, సిబ్బంది కలిపి) మందికి పైగా పీహెచ్‌సీల నుంచి అనధికార డెప్యుటేషన్లు ఇచ్చి కార్యాలయంలో దర్జాగా కూర్చోబెట్టారనే విమర్శలు ఉన్నాయి. అమాయకులైతే సులభంగా డెప్యుటేషన్లు వరిస్తున్నాయి. పిలిచి సీట్లో కూర్చోబెడుతున్నారు. ఇక కార్యాలయంలో వర్గపోరు నడుస్తోంది. ఈ పోరుకు బలం చేకూర్చడానికి కొంత మందిని..వాళ్ల అవసరంగా మలుచుకుని అనధికార డెప్యుటేషన్‌లకు ఆజ్యం పోస్తున్నారనే వాదనలున్నాయి. ఈ వర్గ పోరుకు పీహెచ్‌సీలు బలవుతున్నాయి. ఇలానే కొనసాగితే పీహెచ్‌సీలకు వచ్చే ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారే అవకాశం ఉందని పల్లె ప్రజలు వాపోతున్నారు. పనుల పేరుతో అనవసరంగా డెప్యుటేషన్లు వేయడమేంటని వారు మండిపడుతున్నారు.

ఆదేశాలకు విరుద్ధంగా..

వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని డెప్యుటేషన్లు రద్దు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు జనవరిలో ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆదేశాలను పక్కన పెట్టేశారు. అసలు డెప్యుటేషన్లే రద్దు చేయకుండా రద్దు చేసినట్లు చూపించారు. దీనిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ ఉత్తర్వులను పూర్తిగా పక్కనపెట్టి జిల్లా కార్యాలయంలో అధికారులు, సిబ్బందిని కొనసాగిస్తూనే ఉన్నారు. అలాగే కొంత మంది యూడీసీలు వారు పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా కార్యాలయానికి పరిమితం చేశారని, దీంతో పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయని పల్లె ప్రజలు వాపోతున్నారు.

పట్టాభిషేకం ఎవరికో?

- కాణిపాకం చైర్మన్ గిరికి పోటాపోటీ
- అధిష్టానానికి నలుగురు పేర్లు పరిశీలన
- మరో రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం



కాణిపాక దేవస్థానం

కాణిపాకం : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన పాలకమండలి చైర్మన్ కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. పది నెలల విరామం తర్వాత ఇప్పుడిప్పుడే ఈ ప్రక్రియ తెరపైకి వస్తోంది. రెండు రోజుల్లో పాలక మండలిని ప్రకటించే అవకాశాలు ఉందనే ప్రచారం ఊపందుకోవడంతో అందరిలోనూ చైర్మన్ ఎవరు అనే ప్రశ్నలు మెదులుతున్నాయి. చైర్మన్ పదవి కోసం నలుగురు నేతలు పోటీ పడుతుంటే మణినాయుడే చైర్మన్ అనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ పదవి కేటాయింపు మంత్రి లోకేష్ చేతిలో ఉందని, మరో రెండు రోజుల్లో చైర్మన్ టెన్షన్‌కు తెరపడే అవకాశాలున్నట్లు అధికార వర్గం చెబుతోంది.

రేసులో ఆ నలుగురేనా...?

ప్రజాప్రతినిధులు, పెద్ద నేతలు కలిసి నలుగురి పేర్లను సిఫార్సు చేసినట్లు తెలిసింది. అంటే మణినాయుడు, పూర్ణచంద్ర, లత, మధుసూదన్‌ల పేర్లను అధిష్టానం ముందు పెట్టినట్లు సమాచారం. దీనిపై అధిష్టానం సర్వే చేపట్టిందని అధికారవర్గ నాయకులు చెబుతున్నారు. అయితే మణినాయుడికే చైర్మన్ పదవి వరించనుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రావడంతో లోతుగా ఎవరి ప్రయత్నాల్లో వారు పడ్డట్లు తెలుస్తోంది.

పింఛన్ల పంపిణీలో కార్యదర్శి నిర్లక్ష్యం

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని అనుప్పల్లె సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్న ఉద్యోగి.. ప్రజలకు అందించాల్సిన పింఛన్ సొమ్ము తీసుకుని ఇంట్లో ప్రశాంతంగా సేదతీరాడు.. ఈనెల 1వ తేదీన సామాజిక పింఛన్ల పంపిణీ కోసం అనుప్పల్లె సచివాయంలో పనిచేస్తున్న కార్యదర్శికి మున్సిపల్ అధికారులు రూ.2.32 లక్షల నగదు అందజేశారు. ఈ మొత్తాన్ని తీసుకున్న ఉద్యోగి ఇంటికి వెళ్లి తాపీగా నిద్రపోయాడు. వార్డు పరిధిలో ఇంటింటా పింఛన్ల పంపిణీ జరగకపోవడంతో స్థానికులు అధికారులకు విషయం చెప్పారు. 2వ తేదీ కూడా నగదు పంపిణీ జరగకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పలేదు. తీరా విషయం తెలుసుకున్న అధికారులు.. కార్యదర్శి ఏమయ్యాడని విచారిస్తే, డబ్బులు ఇంటికి తీసుకెళ్లి పడుకున్నట్లు తెలిసింది. కార్యదర్శి కుటుంబ సభ్యులను పిలిపించిన అధికారులు, పింఛన్ నగదు మొత్తాన్ని వసూలు చేసి.. మరో కార్యదర్శికి ఈ మొత్తాన్ని అప్పగించి పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు.

పర్యవేక్షణ అధికారుల నియామకం

చిత్తూరు రూరల్(కాణిపాకం) : వైద్య ఆరోగ్య శాఖలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ నిమిత్తం డివిజన్‌కు ఒక్కో అధికారిని నియమిస్తూ గురువారం డీఎంహెచ్‌ఓ సుధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. జీడీ నెల్లూరు డివిజన్‌కు డీఐఓ హనుమంతరావు, పలమనేరుకు టీబీ అధికారి వెంకటప్రసాద్, కుప్పంకు గంగాదేవి, చిత్తూరుకు అనుషా, నగరికి నవీన్ తేజ్, పూతలపట్టుకు గిరి, పుంగనూరుకు అనిల్ కుమార్‌ను నియమించారు. ఆయా డివిజన్‌లల్లో అన్ని హెల్త్ కార్యక్రమాలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

'స్పాట్'కు సాకులు



మూల్యాంకన విధుల రద్దుకు నిరీక్షిస్తున్న టీచర్లు

- విధుల రద్దుకు క్యూ కట్టిన టీచర్లు
- విధులు చేయాల్సిందేనన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలు ముగిసిన వెంటనే (స్పాట్ వాల్యుయేషన్) మూల్యాంకన కసరత్తును విద్యాశాఖ అధికారులు మొదలుపెట్టారు. కసరత్తును నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మొదటి రోజు మూల్యాంకన కసరత్తును ప్రారంభించారు.


ప్లీజ్ విధులు రద్దు చేయండి..

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1,244 మంది వివిధ కేడర్‌ల టీచర్లను మూల్యాంకన విధులకు నియమించారు. అయితే పలువురు టీచర్లు ఏదో ఒక కారణంతో తమకు విధులు రద్దు చేయాలంటూ వినతిపత్రాలు వెంట పెట్టుకుని డీఈఓ మేడమ్ ప్లీజ్ అంటూ వేడుకున్నారు. మొదటి రోజు ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. అయితే 50 శాతం మందికి పైగా రిపోర్ట్ చేసుకోని పరిస్థితి కనిపించింది. దీంతో మధ్యాహ్నం వరకు మూల్యాంకన ప్రక్రియ మొదలు కాని పరిస్థితి నెలకొంది. శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన తర్వాత కొంత మంది విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మూల్యాంకన ప్రక్రియ నిర్వహించారు.



మూల్యాంకనం చేసేందుకు సిద్ధంగా ఉన్న టీచర్లు

గైర్హాజరైన వారికి నోటీసులు




పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చాలా పకడ్బందీగా చేపడుతున్నాం. అనారోగ్యం ఉన్న వారికి మాత్రమే మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఎటువంటి అనుమతి తీసుకోకుండా గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. ఈనెల 10 వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుంది. – వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు.

రైతులకు ధ(వ)నం!

దవనం.. ఇదో సుగంధ మొక్క ..పువ్వులతో పాటే కట్టేటప్పుడు ఈ దవనం రెమ్మల్ని కలుపుతుంటాం. దీనివలన పూలవాసనకు దవనం తోడై మరింత పరిమళం వెదజల్లుతుంది.. ఈ దవనం నుంచి అత్తరు, సెంట్లు, బాడీస్ప్రేలలో వినియోగించడం బాగా ఎక్కువ అయింది..ఫలితంగా దవనం పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది. ఈ స్వల్పకాలిక పంట సాగు చేసి పెద్ద పెట్టుబడులు పెట్టకుండానే రైతులను లాభాల వైపు నడిపిస్తుండడంతో జిల్లాలో ఎక్కువ మంది రైతులు దవనం సాగుకు ఆస్తకి చూపుతున్నారు.

- జిల్లాలో విభిన్నంగా 'దవనం' సాగు
- ఎర్రటి నేలలు పంట సాగుకు అనుకూలం
- ఆకు కిలో రూ.40 దాకా అమ్మకాలు
- నూనె రూ.45 వేలు పలుకుతున్న వైనం
- అన్నదాతను ఆదుకునే లాభాల పంటగా పేరు

పలమనేరు : జిల్లాలోని పడమటి మండలాల్లో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలైన కూరగాయల వైపు దృష్టి సారించారు. కానీ వాటికి సైతం ఎప్పుడు ధరలుంటాయో? కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.. దీంతో కాస్త విభిన్నంగా ఆలోచించిన కొంత మంది రైతులు సుగంధ పంట అయిన దవనాన్ని సాగు చేయడం కొన్నేళ్లుగా చేస్తున్నారు. పెద్దగా పెట్టుబడి లేకుండా ఎకరానికి నికరంగా రూ.50 వేల దాకా ఆదాయం దక్కుతుండడంతో పలువురు రైతులు దవనం సాగుపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇది స్వల్పకాలికంగా మూడు నెలల పంట కావడం, సాగునీరు పెద్దగా అవసరం ఉండదు. పురుగు మందులు, కూలీల సమస్య లేనందున కచ్చితంగా లాభాలు దక్కుతాయనే మాట రైతుల్లో వినిపిస్తోంది.



పంటకు అనుకూలమైన ఎర్రటినేలలు

సాగు ఎలాగంటే..

దవనం ఏకవార్షిక పంట. వృక్షశాస్త్రం ప్రకారం ఆస్టరేసీ కుటుంబానికి చెందిన సువాసన మొక్క. దీని పంట కాలం కేవలం 80 రోజులు మాత్రమే. ఇది ఈ ప్రాంతంలో శీతాకాలంలో సాగు చేస్తుంటారు. తక్కువ ఉష్ణోగ్రత కలిగిన పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజక వర్గాల్లోని ఎర్రమట్టి నేలలు దీనికి అనుకూలం. ముఖ్యంగా అక్టోబరులో దుక్కిళ్లు సిద్ధం చేసుకొని నవంబరులో పంటసాగు చేస్తే ఫిబ్రవరికి పంట చేతికొస్తుంది. ఎకరా పొలానికి 600 గ్రాముల విత్తనాలను కొని దానికి పదిరెట్ల ఇసుకను కలిపి తడి గుడ్డలో మూటకట్టి మూడు రోజుల తర్వాత పొలంలో చల్లాలి. ఎకరానికి రూ.6 వేలు ఖర్చుతో పంట వచ్చాక కిలో ఆకులు రూ.40 నుంచి రూ.50 దాకా పలికినా ఎకరానికి రూ.45 వేల నుంచి రూ.50 వేల దాకా రాబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆయిల్ పరిశ్రమలకు భలే డిమాండ్

ఈ ప్రాంతానికి సమీపంలోని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి, సేలం, కర్ణాటకలోని బెంగళూరు, చిక్‌బళ్లాపూర్, దొడ్డనేకుక్కంది, సర్జాపురలో దవనం ఆయిల్ పరిశ్రమలున్నాయి. దీంతో అక్కడి ఏజెంట్లు ఇక్కడి తోటలను పంట మీదుగానే కొని రైతులకు డబ్బు చెల్లించి పరిశ్రమలకు తరలిస్తుంటారు. దీంతో రైతులకు రవాణా చార్జీలు మిగిలినట్టే. ఇక మార్కెటింగ్ సౌకర్యం ఉండడంతో ఆశావాహులైన రైతులు దవనం సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



బైరెడ్డిపల్లి : పాతపేటలో సాగైన దవనం పంట (ఫైల్), (ఇన్‌సెట్‌లో) పరిశ్రమలో తయారైన దవనం నూనె

ప్రయోజనాలు ఇలా..

దవనం సాధారణంగా పూలహారాల మధ్యలో సువాసన కోసం వాడుతుంటారు. దీని నూనెను సుగంధ పరిమళాల కోసం ఉపయోగించే సెంటు, అత్తర్, పలు బాడీ స్ప్రేలకు వాడుతున్నారు. దీంతో పాటు కొన్ని ఔషధాల తయారీకి దవనాన్ని వినియోగిస్తుంటారు. దీంతో అక్కడ నూనెకు డిమాండ్ ఉండడంతో ఇక్కడ రైతులకు దవనం గిట్టుబాటుగా మారింది.

సేంద్రియ పద్ధతిలో సాగు చేశా



నేను ఎకరా పొలంలో గతంలో దవనం పంటను సేంద్రియ పద్ధతిలో సాగు చేశా. ఎలాంటి పురుగు మందులు వాడలేదు. కేవలం దుక్కిలో ఆవు పేడ ఆపై బీజామృతం, వేప నూనె లాంటివి మాత్రమే వాడాను. ఎర్రటి నేలల్లో తక్కువ ఉష్ణోగ్రతలున్న ప్రాంతంలో దవనాన్ని సాగు చేసుకోవచ్చు. సేంద్రియ పద్ధతిలోనే ఎక్కువ పంట ఉత్పత్తిని పెంచి లాభాలు సాధించా.

– ఉమ, మహిళా రైతు, పాతపేట

చల్లటి వాతావరణంలో సాగు చేయవచ్చు



జిల్లాలో చల్లటి ప్రదేశాలైన పలమనేరు, కుప్పం, పుంగనూరులో ఎర్రటినేలలు దవనం సాగుకు అనుకూలంగా ఉంటాయి. శీతాకాలంలో ఈ పంట సాగవుతుంది. పెద్దగా పెట్టుబడి లేకుండా నికర లాభాలు పొందాలనుకునే రైతులు దీన్ని సాగు చేసుకోవచ్చు. అయితే ముందుగా పరిశ్రమ వారితో ఒప్పందం చేసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

– డా.కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

క్లుప్తంగా

యువతిపై లైంగిక దాడికి యత్నం

గుడుపల్లె : మండలంలోని సిరిగిరిపల్లె గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఓ యువతిపై లైంగిక దాడికి యత్నించాడు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు... సిరిగిరి పల్లెలోని సంతోష్ రెండు రోజుల కిందట 18 ఏళ్ల యువతిని పొలం వద్దకు ఆటలాడుకుందామని నమ్మించి తీసుకెళ్లాడు. ఆపై అత్యాచార యత్నానికి ప్రయత్నించగా ఆ యువతి కేకలు వేయడంతో సంతోష్ పారిపోయాడు. ఈ విషయంపై యువతి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం


జీనత్

తవణంపల్లె : మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని అరగొండకు చెందిన అల్లాబకష్ భార్య జీనత్(55)కు మతిస్థిమితం లేకపోవడంతో బాగాయం హాస్పిటల్లో చికిత్స చేయిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో గతనెల 30వ తేదీన రంజాన్ పండుగ సందర్భంగా దుకాణంలో సరుకులు తీసుకొస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. అరగొండ పరిసరాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీనిపై భర్త ఫిర్యాదు మేరకు మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య


అంజమ్మ మృతదేహం

గుడుపల్లె : భర్త వేధింపులు భరించలేక భార్య అంజమ్మ(45) ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం పెద్దపర్తికుంటలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు.. మండలంలోని పెద్దపర్తికుంట గ్రామానికి చెందిన బాలక్రిష్ణ తమిళనాడులోని శూలగిరికి చెందిన అంచలగిరిలోని అంజమ్మను వివాహం చేసుకున్నాడు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త బాలక్రిష్ణ మద్యానికి బానిసై నిత్యం భార్యను వేధించేవాడన్నారు. పలుమార్లు చెప్పినా భర్తలో ఎటువంటి మార్పు రాకపోవడంతో విసుగు చెంది గురువారం ఇంటిలోనే ఉరివేసుకుని అంజమ్మ ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చిత్తూరు నగరానికి చెందిన ఓ ఇద్దరు మహిళలు తమిళనాడులోని అరుణాచలం వెళ్లి అర్ధరాత్రి సమయంలో వేలూరులో దిగారు. అక్కడి నుంచి చిత్తూరు రావడానికి బస్సు కోసం చాలా సేపు వేచి ఉన్నారు. తీరా చిత్తూరు-తిరుపతి వెళ్లే ఏపీ02జెడ్ 5395 నంబరు బస్సు కండక్టరును ప్రాధేయపడ్డారు. ఎంత బతిమిలాడుకున్నా పట్టించుకోలేదు. సామాజిక మాధ్యమం వేదికగా అధికారులకు ఫిర్యాదు చేశారు.

● తమిళనాడులోని తిరువణ్ణామలైకు చిత్తూరు మీదుగా తిరుపతి వెళ్లేందుకు ఇంద్ర బస్సులు ఉన్నాయి. ఇటీవల దైవ దర్శనార్థం వెళ్లిన ఓ ప్రయాణికుడు చిత్తూరు వచ్చేందుకు టిక్కెట్లు కొట్టే వ్యక్తిని ఆశ్రయించాడు. ఈ బస్సు చిత్తూరులో ఆగదంటూ ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. కేవలం తిరుపతి టిక్కెట్లు మా త్రమే ఎక్కిస్తామని చెప్పాడు. లేకుంటే తిరుపతి టిక్కెట్ తీసుకుని చిత్తూరులో దిగొచ్చని చెప్పుకొచ్చాడు. ఆ టిక్కెట్లు ఇచ్చే వ్యక్తే అక్కడ రిజర్వేషన్ పాయింట్ ఒకటి పెట్టుకుని టిక్కెట్లు బుకింగ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరా.. సీటు లేదు!

చిత్తూరు ప్రయాణికులంటే ఆర్టీసీ చిన్నచూపు చూస్తోంది. వేలూరులో చిత్తూరంటేనే బస్సు ఎక్కనివ్వడంలేదు. ఒక వేళ ఎక్కినా...సీటు లేదంటూ దింపేస్తున్నారు. చిత్తూరుకు రావాలంటే రాత్రిపూట ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం అంటూ మండి పడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)


ఆర్టీసీ బస్సు

- బస్సు ఎక్కనివ్వని కండక్టర్లు
- చిత్తూరు ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు
- వేలూరులో ఆర్టీసీ బస్సుల్లో రోజూ గొడవలే
- రాత్రిపూట అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

ఆర్టీసీ చిత్తూరు మీదుగా వేలూరుకు 46 బస్సులు కేటాయించింది. ఇందులో చిత్తూరు-2 డిపో నుంచి 9 బస్సులుండగా 54 ట్రిప్పులు, అరుణాచలంకు 4 బస్సులుండగా 8 ట్రిప్పులు, తిరుమల నుంచి 33 బస్సులకు గాను 66 ట్రిప్పులు ఆర్టీసీ తిప్పుతోంది. ఈ ప్రయాణంలో చిత్తూరు నుంచి వేలూరు వెళ్లేటప్పుడు మాత్రం ఆర్టీసీ బస్టాండు నుంచి గుడిపాల వరకు కాట్పాడి...వేలూర్....వేలూర్ అంటూ పిలిచి ఎక్కించుకుంటున్నారు. తిరుమల సర్వీసుల్లో కూడా ఇలానే గౌరవంగా పిలిచి ఎక్కించుకుంటున్నారు. ఇలా నిత్యం వేలూరుకు వేల మంది వెళ్లి వస్తుంటారు. ప్రధానంగా సీఎంసీ, దుస్తుల కొనుగోలు, వ్యాపార లావాదేవీలు, వాహన, ఇతర సామగ్రి, ఎరువులు తదితర పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తిరుగు ప్రయాణంలో చిత్తూరంటే ఆర్టీసీ కండక్టర్లు బస్సుల్లో ఎక్కించుకోకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోతున్నారు.

వేలూరు ఒక్కటే కాదు...

తమిళనాడులోని అరుణాచలం నుంచి చిత్తూరు చేరుకోవడానికి ప్రయాణికులు తంటాలు పడుతున్నారు. ఇంద్ర సర్వీసులాంటి ఏసీ బస్సులంటే సీట్లు లేవంటున్నారు. తిరుపతికి మాత్రమే సీటు ఉందని..ఈ-టిమ్ మిషన్‌లో చిత్తూరు టిక్కెట్లకు ఆప్షన్ ఇవ్వలేదని కుంటి సాకులు చెబుతున్నారు. ఇక చిత్తూరు లోపలికి బస్సు వెళ్లదంటూ..వేరే బస్సు చూసుకోండి అంటూ చిత్తూరు ప్రయాణికులను బస్సులో అడుగు పెట్టనివ్వడం లేదు. అలాగే బెంగుళూరు నుంచి తిరుపతి, విజయవాడ, నెల్లూరుకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా చిత్తూరు ప్రయాణికులను ఎక్కించడం లేదు. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నా ఆర్టీసీ అధికారులు తేలికగా తీసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా కాలం తర్వాత చిత్తూరు ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించుకోవడం లేదని ఫిర్యాదు వస్తే అప్పటి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తక్షణం స్పందించారు. ఏ డిపో బస్సులైనా చిత్తూరు ప్రయాణికులను ఎక్కించాల్సిందేనని ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఆయన వైస్ చైర్మన్‌గా ఉన్నంత కాలం ఈ సమస్య రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది.



తిరుపతి డీపీటీఓతో మాట్లాడుతున్నాం..

వేలూరు నుంచి చిత్తూరుకు వచ్చే ప్రయాణికులను తిరుపతికి వెళ్లే బస్సుల్లో ఎక్కించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై తిరుపతి డీపీటీఓతో మాట్లాడుతున్నాం. కచ్చితంగా సమస్యలు రాకుండా చూస్తాం. ఏ మార్గాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయో చూసి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– జగదీష్, డీపీటీఓ, చిత్తూరు

12 టన్నుల కూరగాయల వితరణ


వాహనంలో కూరగాయలు

పలమనేరు : పట్టణానికి చెందిన శ్రీవారి సేవకులు రవీంద్రారెడ్డి మిత్ర బృందం కలిసి కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు కూరగాయల మార్కెట్ నుంచి ఒంటిమిట్ట కోదండరామ ఆలయంలో జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు భక్తుల అన్నదానం కోసం 12 టన్నుల వివిధ కూరగాయలను గురువారం టీటీడీ ప్రత్యేక వాహనం ద్వారా ఒంటిమిట్టకు పంపారు. టీటీడీ అధికారుల సూచనల మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో సోమశేఖర్, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,721 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,545 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాటేస్తున్న కరెంటు తీగలు

- మూడు రోజుల్లో ఇద్దరు మృతి
- గురువారం ఆలయం వద్ద గజముఖన్ మృత్యువాత
- నాడు క్రికెట్ ఆడుతూ లోహిత్ దుర్మరణం
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?


మృతి చెందిన గజముఖన్


పత్రపల్లెలో మృతి చెందిన లోహిత్ (ఫైల్)

పుంగనూరు : వేసవిలో పండుగ సెలవులు రావడంతో గ్రామ సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులను మూడు రోజుల వ్యవధిలో ఇద్దరిని కరెంటు బలితీసుకుంది. ఈ సంఘటనలతో పుంగనూరు మండలంలోని అరవపల్లి, పత్రపల్లి గ్రామాల్లో విషాదం అలుముకుంది. నిర్లక్ష్యానికి ఇద్దరు చిన్నారుల ప్రాణాలు మూడు రోజుల్లో గాలిలో కలిసిపోవడంతో జనం విద్యుత్ అధికారులపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అరవపల్లె గ్రామంలో దళితవాడలో నివాసం ఉన్న రత్నప్ప, అంజమ్మ దంపతుల ఏకైక కుమారుడు గజముఖన్(09) 3వ తరగతి చదువుతున్నాడు. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద చిన్నారులతో కలసి గురువారం ఆడుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురై య్యాడు. సహచర బాలురు కేకలు వేయడంతో తల్లిదండ్రులు ఆ బాలుడిని కాపాడి పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఒకే కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలచివేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మండలంలోని పత్రపల్లిలో సోమవారం క్రికెట్ ఆడుతున్న 14 సంవత్సరాల లోహిత్ 7వ తరగతి చదువుతున్నాడు. పండుగ సెలవులు రావడంతో గ్రామ సమీపంలో స్నేహితులతో క్రికెట్ ఆడుతూ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. కాగా గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడటం, విద్యుత్ స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామీణ వాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైన విద్యుత్ అధికారులు గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ లైన్లు, స్తంభాలు పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని , లేకపోతే ఈ వేసవి సెలవుల్లో మరెన్ని ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రియల్ ఎస్టేట్‌కు శ్రీవారు బ్రాండ్ అంబాసిడరా?

- కూటమి హయాంలో దిగజారిన టీటీడీ ప్రతిష్ఠ
- కొండపై విచ్చలవిడిగా మద్యం, మాంసం
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : సీఎం చంద్రబాబు రియల్ ఎస్టేట్ వెంచర్లకు శ్రీ వేంకటేశ్వరస్వామిని బ్రాండ్ అంబాసిడర్‌గా మారుస్తున్నారని, ఇందుకు ఆగమశాస్త్ర సలహాలు తీసుకోవాలని చెప్పడం దారుణమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ ప్రతిష్ఠను కూటమి ప్రభుత్వం రోజు రోజుకు దిగజార్చుతోందని మండిపడ్డారు. చెన్నైలో జీ స్క్వేర్ సంస్థ సొంత నిధులతో ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు చెప్పడం ఎంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ అభ్యంతరం చెప్పినా సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వేంకటేశ్వర స్వామి, టీటీడీని ప్రమోటర్‌గా చేసే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థకు దేశ వ్యాప్తంగా వెంచర్లు ఉన్నాయని, సొంత నిధులతో ఇలానే దేవాలయాలు నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చి, వాళ్ల వ్యాపారం పెంచుకుంటారన్నారు. సొంత ఖర్చులతో టీటీడీ ఆలయాలు కడితే తప్పు ఏంటీ అని సాక్షాత్తు సీఎం అనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నాణ్యమైన లడ్డూ

తిరుమల లడ్డూ నాణ్యత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పెరిగిందని భూమన కరుణాకరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలతో శ్రీవారి అన్న ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 3, 4 వేల లోపు వీఐపీ దర్శనాలుంటే కూటమి పాలనలో రోజుకు ఏడు వేలకు పెరిగాయన్నారు. మంత్రి నారా లోకేష్ పీఏ సాంబశివరావు రోజుకు 10 నుంచి 13 సిఫార్సు లెటర్లు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. సనాతన ధర్మాన్ని కాపాడతామని చెప్పిన డిప్యూటీ సీఎం ఎక్కడ? అని నిలదీశారు.

టీటీడీ ప్రతిష్ఠ దిగజార్చుతున్నారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి టీటీడీ ప్రతిష్ఠ మరింతగా దిగజార్చుతున్నారని భూమన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సాక్షాత్తు ఆ పార్టీ నాయకులు, భక్తులే అంటున్నారని చెప్పారు. లడ్డూ వివాదం మొదలుకొని నేటి వరకు అన్నీ అపచారాలే అని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ పాలనపై చేసిన ఆరోపణలకు సీబీఐ, సిట్ ఒక్క ఆధారం చూపించలేదన్నారు. తిరుమలలో బాలాజీ నగర్, ఇతర ప్రాంతాల్లో మద్యం, మాంసం విచ్చలవిడిగా అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కాళ్లావేళ్ల పడి విచారణను ఆపుకోలేదా?

వైకుంఠ ఏకాదశి తొక్కిసలాట ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి హోం శాఖ నుంచి విచారణకు జారీ చేసిన ఆదేశాలను కాళ్ల వేళ్లా పడి ఆపుకోలేదా?.. ఇది నిజం కాదా? అని భూమన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలాంటి ఘటనలు ఎక్కడ జరగ లేదని ధీమా వ్యక్తం చేశారు.

లారీలు ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో ఢీకొన్న లారీలు

గుడిపాల : రెండు లారీలు ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని చీలాపల్లె సీఎంసీ ఆసుపత్రి సమీపంలో గురువారం ఉదయం లారీ ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో డ్రైవర్లు మారియప్పన్ (32), కాశీశ్వరన్(40)ను 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీంతో దాదాపు అరగంట పాటు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిని కొడుతున్నాడని.. తండ్రిని హత్య చేసిన కొడుకు


శ్రీనివాసులు మృతదేహం

శ్రీరంగరాజపురం : మద్యం మత్తులో తల్లిని కొడుతున్న తండ్రిపై కొడుకు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన సంఘటన శ్రీరంగరాజపురం మండలంలోని డిఆర్.ఆర్.పురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డి.ఆర్.ఆర్.పురం గ్రామానికి చెందిన మందడి శ్రీనివాసులు (60) ప్రతి రోజు మద్యం తాగి తన భార్యను చిత్ర హింసలు పెడుతూ ఉండేవాడు. ఆయన కొడుకు నాగరాజు మద్యం మానేయమని తండ్రి శ్రీనివాసులకు ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఇంట్లో తరుచూ గొడవలు జరిగేవి. బుధవారం రాత్రి మద్యం మత్తులో శ్రీనివాసులు తన భార్యను కొట్టడంతో కొడుకు నాగరాజు కోపంతో కొయ్యతో తండ్రి తలపై బలంగా కొట్టడంతో శ్రీనివాసులు అక్కడికక్కడే కూలిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

ఆలయాలు, మసీదులు, చర్చిల్లో సీసీలు తప్పనిసరి


ఆలయ పరిశీలనలో పోలీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వెంకట నారాయణ పేర్కొన్నారు. చిత్తూరు మండలంలోని బీఎన్ఆర్‌పేట, దిగువమాసాపల్లి, శెట్టిగారిపల్లి గ్రామాల్లోని ఆలయాలు, చర్చిలు, మసీదులను గురువారం పరిశీలించారు. సీసీ కెమెరాలపై ఆరా తీశారు. ఆయా కమిటీ సభ్యులను పిలిచి మాట్లాడారు. కచ్చితంగా సీసీ కెమెరాలు ఉండాలని ఆదేశించారు. అలాగే బీఎన్ఆర్‌పేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

రైటింగ్ స్కిల్స్‌తో సమాచారం విశ్వవ్యాప్తం


వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : అకడమిక్ రైటింగ్ స్కిల్స్ పెంపొందించుకుంటేనే ఆలోచనలు, రచనలు వంటి సమాచారం ప్రపంచానికి చేరుతుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో 'విద్యార్థులకు, పండితులకు అకడమిక్ రైటింగ్– మెళకువలు' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు, పరిశోధకులు, పండితులు రైటింగ్ స్కిల్స్ పై ప్రత్యేక దృష్టి సారించి మెళకువలను అభ్యసనం చేయాలని సూచించారు. దిండిగల్ గాంధీ గ్రామ్ రూరల్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జోసెఫ్ దొరైరాజ్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి అకడమిక్ రైటింగ్ నైపుణ్యాలు, ఏకీకరణ, పొందిక, స్పష్టత అనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ టి శారద మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ రైటింగ్ స్కిల్స్ ఎంతో అవసరమని, ఎన్ఈపీ 2020తో దీని ఆవశ్యకత సంతరించుకుందని ఇందుకోసం జాతీయ వర్క్‌షాపు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో షార్ట్ సర్క్యూట్

- భయాందోళనకు గురైన రోగులు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. అత్యవసర విభాగం సమీపంలోని ఎమర్జెన్సీ మెడికల్ కేర్ యూనిట్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీ ప్లగ్ పాయింట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఏసీ వైర్లు కాలిపోవడంతో పొగలు కమ్ముకున్నాయి. దీంతో రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందో తెలియక హడావుడి పడ్డారు. పక్కనే ఉన్న వైద్య సిబ్బంది సర్ది చెప్పి రోగులను సముదాయించారు. వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది వచ్చి పరిశీలించి, ఏసీ వైర్లు కాలిపోయాయని గుర్తించారు. దీంతో అధికారులు, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

'ఉపాధి' కెళ్లి.. ఆస్పత్రిపాలయ్యారు!


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ట్రాక్టర్ బోల్తా .. 21 మంది కూలీలకు గాయాలు
- ఇద్దరి క్షతగాత్రులను రుయాకు తరలింపు

విజయపురం/నగరి : ఉపాధి కోసం వారంతా ఉదయాన్నే బయలుదేరారు.. ట్రాక్టర్ బోల్తా పడి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 19 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన విజయపురం మండలం పన్నూరు పిళాసపాళెం రోడ్డులో చోటు చేసుకుంది. పన్నూరు శివారులోని గుట్టల వద్ద ఉపాధి పనుల కోసం ఆమగుంట నుంచి 22 మంది కూలీలు ఉదయాన్నే ట్రాక్టర్ ట్రాలీలో బయలుదేరారు. పన్నూరు శ్మశాన వాటిక సమీపం వెళుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పల్లపుప్రాంతంలో బోల్తా పడింది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం జరగలేదు. అందులో ఉన్న కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మూడు 108 వాహనాల్లో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో అమరమ్మ(65) తలకు గాయం కాగా, కాంతమ్మ(63)కు చేయి, భుజం వద్ద ఎముకలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. వారిని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. మిగిలిన జి.సరస్వతి (48), రోజా (30), పద్మ (35), దేశమ్మ (37), జ్యోతి(45), రాణి (60), మునియమ్మ (47), కన్నెమ్మ (50), ధనమ్మ (60), శకుంతల (58), స్టాలిన్ (40), శ్యామల (39), శివమ్మ (50), గోవిందమ్మ (60), విమల (35), మన్నారమ్మ(49), ఉషా(42), మునికృష్ణ (60), లక్ష్మి (62) స్వల్ప గాయాలు కాగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. కాగా ఉపాధి కూలీల్లో ఏడుగురు 60 ఏళ్ల వయస్సు ఉన్నవారే ఉన్నారు. ట్రాక్టర్ మరింత వెనక్కు వాలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తలకు గాయాలై చికిత్స పొందుతున్న అమరమ్మ


చేయి విరగడంతో చికిత్స పొందుతున్న కాంతమ్మ

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

కూలీలు గాయపడిన ట్రాక్టర్‌ను ఉపాధి కూలీ అయిన 60 ఏళ్ల వయస్సున్న మునికృష్ణ సొంతంగా ట్రాక్టరు నడిపాడు. లైసెన్సు లేని ఆయన ట్రాక్టర్ అద్దె, డ్రైవర్ భత్యం, ఉపాధి కూలీ అన్ని తనకే వస్తాయనే ఆశతో నిర్లక్ష్య ధోరణిలో ట్రాక్టర్‌ను నడపటమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామసభల్లో స్థానికంగా ఉన్న సప్లై ఛానల్ పనులు, చెరువుకట్ట శుభ్రత పనులు చేయాలని సూచించినా ట్రాక్టర్ బాడుగ కోసమే సుదూర ప్రాంతాల్లో అడవులు, గుట్టల వద్దకు పనులు పెడుతున్నారని దీనికి ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి సహకరిస్తుండటంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.